# అర్థంకాని ఆడది

మూకల సీతారామారావు

**మాధవరావుగారు** రొప్పుతూ వచ్చి అప్పుడే కుర్చీలో చతికిల పడ్డాడు. ఎండాకాలం. పైగా దాదాపు గంట బస్సు ప్రయాణం, తను ఇంటి నుంచి ఆఫీసు చేరుకునే సరికి ఒంట్లో ఓపిక సగం చచ్చిపోతుంది. ఆఫీసులో పని విపరీతంగా ఉంటోంది. మరి ఈ మధ్య మూడింటి రెండింటు ప్రమోషన్‌తో రోజుకి పది గంటలు ఆఫీసు పనితోనే సరిపోతోంది.

మాధవరావు సికింద్రాబాద్‌లోని ఒక ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. ఇప్పటికి దాదాపు ఇరవై ఏళ్ళ సర్వీసు పూర్తయింది. ఇంతకుముందు క్లర్కుగా కమర్షియల్ సెక్షన్‌లో పనిచేస్తూ, ప్రమోషన్ రాగానే ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కి మారాడు. ఇక్కడ దాదాపు రెండు వేల ఉద్యోగుల లీవు, జీతం, రిటైర్మెంటు వగైరాలన్నీ మాధవరావే చూసుకోవాలి.

"గుడ్ మార్నింగ్, సర్" అన్న కమల కంఠం వినగానే ఏదో ఆలోచనల్లో ఉన్న మాధవరావు ఒక్కసారి తలెత్తి కమల వంక చూశాడు చిరునవ్వుతో.

"ఈ మధ్య మీరు మీ అమ్మాయికి టెన్త్ క్లాస్ తెలుగు టెక్స్టుబుక్ దొరకటం లేదన్నారుకదా! నిన్న నే నలా సికిందరాబాదు స్టేషను వైపు వెళ్తుంటే, ఫుట్ పాత్ దగ్గర సెకండ్ హాండ్‌లో ఈ పుస్తకం కనబడ్డది. మీకు అవసరం కదా అని తీసుకున్నాను, సార్" అంది కమల.

కమలకు ఈ ఆఫీసులో దాదాపు పదేళ్ళ సర్వీసు ఉంది. మనిషి చాలా అందగత్తె. ఆ అందానికి తగినట్టు కట్టూ బొట్టూ కూడాను. చీరకట్టే తీరు, భుజాల మీంచి అలా పొత్తికడుపు దాక చీర అంచు కనబడేట్టు కట్టుకుని, భుజం దగ్గర బొడ్డు దగ్గర రెండు సేఫ్టీ పిన్స్ పెట్టి అలా కుచ్చెళ్ళు ముందర పడ్తూ వస్తుంటే పాపయ్య 'వయ్యారి' బొమ్మలా ఉంటుంది.

ఎరుపు చీరైతే మాచింగ్ జాకెట్టు, మాచింగ్ చెప్పులు, మాచింగ్ బొట్టూ, చివరికి మాచింగ్ హెయిర్ స్ట్రాప్ వేసుకుని, మహా దర్జాగా వస్తుంది ఆఫీసుకు చేతిలో ఒక మాచింగ్ హాండ్‌బాగ్‌తో. మనిషికి దాదాపు ఇరవై ఎనిమిదేళ్ళుంటాయి. కాని, చూడ్డానికి మాత్రం శోభనా కాకుండా ఏ ఇరవై ఏళ్ళో అన్నట్టుంటుంది. తమన్న చోట వెయ్యి సూర్య కాంతులు వెదజల్లుతుంది ముద్దబంతి పువ్వులాంటి కమల.

కమల దాదాపు రెండు వందల మంది ఆడవాళ్ళు పనిచేస్తున్న ఆఫీసులో అందరి కంటె అందమైంది అని చెప్పడంలో సందేహం లేదు. పైగా పెళ్ళయి దాదాపు పదేళ్ళయినా; చూడగానే ఇంకా పెళ్ళి కానట్టు ఉంటుంది.

ఆ రోజు, కమల చిలక పచ్చని ఎర్రరంగు పెద్ద అంచు ఉన్న చీరతో, మెడలో ఆకుపచ్చని ముత్యాలు, ఆకుపచ్చని బొట్టుతో వచ్చింది. చూస్తుంటే కళ్ళు తిప్పుకోరు ఎవరికైనా, మాధవరావుకే కాదు.

కమలకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ అమ్మాయిలే. ఒక అమ్మాయికి ఎనిమిదేళ్ళు. ఇంకో అమ్మాయికి ఆరు. భర్త ఎక్కడో పోలీస్ డిపార్ట్‌మెంటులో పనిచేస్తాడట. తను చిన్నగా ఉన్నప్పుడే కావలసిన వాళ్ళ సంబంధమని ఇంట్లో ఒక కాలు కాటిలో పెట్టి కూర్చున్న వాళ్ళ బామ్మ ఆఖరి కోర్కె తీర్చాలని వాళ్ళ అమ్మా నాన్న వాళ్ళు కమల పెళ్ళి కానిచ్చేశారు.

కమలంటే ఆఫీసులో మిగతా స్టాఫ్‌కి మంచి అభిప్రాయ మేమీ లేదు.

తను అలా ఒక డిపార్టుమెంటు నుండి ఇంకో డిపార్టుమెంటుకి వరండాలో నడిచి వెళ్తుంటే చివరికి ఊపిరి కూడ పీల్చకుండా చూసే తోటి గుమాస్తాలు, సమయం దొరికినప్పుడల్లా కాంటీన్లోనూ, లంచ్ రూమ్‌లోనూ కమల విషయం వస్తే గంటల కొద్దీ చర్చిస్తూ ఉంటారు.

"అది మహా చాలూరా" అంటాడు రఘు.

"రాత్రికి వెయ్యట" అన్నాడు జేమ్స్. "మొన్నీ మధ్య ఎల్. ఐ. సి. లో పనిచేస్తున్న మా స్నేహితుడి వాళ్ళ ఆఫీసరు బుక్ చేసుకున్నాట్ట కమలని. మూడు గంటలకి ఐదొందలు తీసుకుందిట" అన్నాడు రాజా.

"దీని కాంటాక్ట్ మనిషి మనకి దొరకడం లేదు, గురూ. దీని అప్పుడియ్యా ఐదొందలు, వర్తే గురూ" అన్నాడు అశోక్, ఆరుగురు పిల్లల తండ్రై ఉండీ.

"మొన్నీ మధ్య పేపరులో వచ్చింది చూడు— పోలీసులు రైడ్‌చేసి ముగ్గురు వర్కింగ్ గర్ల్స్‌ని పట్టుకున్నారని. నా కెందుకో అనుమానంగా ఉంది, గురూ, మన కమల కూడా అందులో ఉందని. పోలీసు వాళ్ళు నాకుకుని వదిలేసి ఉంటారు ..."

ఇవన్నీ కమల గురించి జరిగే సాధారణ చర్చలు ఆ ఆఫీసులో.

ఈ మాటలన్నీ వింటూ ఉండే మాధవరావుకు కమలని చూసినప్పుడల్లా ఎందుకో ఈ మాటల్లో నిజం లేదనిపిస్తుంది.

కమల అందరితో చక్కగా మాట్లాడుతుంది. ఎవరికైనా వర్క్ ఎక్కువగా ఉన్నప్పుడు వెళ్ళి వాళ్ళకు సహాయం చేస్తుంది.

ఏదైనా సమస్య వస్తే సిగ్గుపడకుండా చక్కగా చర్చిస్తుంది.

తనెప్పుడైనా సెక్షన్‌లో కాఫీ తెప్పించుకున్నప్పుడు ప్రక్క నెవరైనా ఉంటే వాళ్ళకీ కాఫీ తెప్పిస్తుంది. ఒకే కప్పుంటే — "పరవాలేదండీ, ఫిఫ్టీ ఫిఫ్టీ తీసుకుందాం" అంటుంది, ఏమాత్రం అరమరికలు లేకుండా.

తన కెందుకో, మిగతా వాళ్ళు కమల గురించి మాట్లాడే మాటల్లో నిజం లేదనే అనిపిస్తుంది. కాని ...

మరి కొన్ని విషయాలు చూస్తుంటే మళ్ళీ మళ్ళీ ఎందుకో తనకీ కమల మీద అనుమానం వస్తూ ఉంటుంది.

ఎప్పుడూ, ఏవో టెలిఫోన్‌లు వస్తూనే ఉంటాయి. అందరి ఆడవాళ్ళ లాగ ఏదో ముక్తసరిగా రెండు ముక్కలు మాట్లాడి టెలిఫోన్ పెట్టెయ్యకుండా, గంటల తరబడి నవ్వుతూ మాట్లాడుతూ ఉంటుంది. టెలిఫోన్ ఇలా పెట్టెయ్యగానే, అలా ఇంకో టెలిఫోన్ వస్తూనే ఉంటుంది కమలకి.

ఒక రోజు — తనూ, తన దగ్గర పనిచేసే అశోక్ కాఫీ కెళితే, అక్కడ అశోక్ తన అలవాటు ప్రకారం కమల కబుర్లెత్తాడు.

"అదిగో, అక్కడ నిలబడ్డాడు చూడండి. ఆ ఎర్రపాంటు, తెల్ల చొక్కా వేసుకుని—సప్లై డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే క్లర్కు — రమేష్— ప్రస్తుతం మన కమలకి బాయ్ ఫ్రెండ్. కమల కొచ్చే డజను టెలిఫోన్లలో రోజూ వీడివే ఉంటాయి అరడజను.

"సార్! మీకు తెలుసో తెలీదో కానీ, వీడు కమల కన్న చిన్న వాడు. అయినా, కమలని చూస్తే, అన తీవిడకు గత పది సంవత్సరాలుగా ఇరవై ఏళ్ళు దాటేయా అనిపిస్తూ ఉంటుంది. ఆఫ్టర్ ఆల్, లవ్ ఈజ్ బ్లైండ్, సర్" అన్నాడు అశోక్ కాఫీ చప్పరిస్తూ.

మాధవరావుమాత్రం అలా రమేష్‌నే చూస్తూ ఉండిపోయాడు.

ఛీ, ఈ ఆడవాళ్ళకి అసలు ఒక నీతి అంటూ ఉండదు కాబోలు. పెళ్ళయి, సంసారం చేస్తూ పిల్లల్ని కని కూడా, ఇంకా ఎందుకో ఈ వెధవ్వేషాలు. అసలు వీళ్ళకి ఉద్యోగాలే ఇవ్వకూడదు. పది మంది మగాళ్ళ మధ్య తిరుగుతూ ఉంటే పుడుతుంది కాబోలు తెగులు.

మాధవరావు తిరిగొచ్చి సీట్లో కూర్చున్నాడు.

టెలిఫోన్ మ్రోగింది.

"హలో" అన్నాడు మాధవరావు.

మాధవరావుకి ఒళ్ళు మండింది.

ఆ టెలిఫోన్ కమలకే.

"కమలగారూ! టెలిఫోన్" అన్నాడు చికాగ్గా.

కమల వచ్చి టెలిఫోన్‌లో మాట్లాడుతోంది సీరియస్‌గా. ఎదురుగా ఏదో ఫైల్ డిస్కస్ చేద్దామన్న మిషతో వచ్చి కూర్చున్న రాజా, ఒక చెవి అటు కమల సంభాషణ వైపు పడేశాడు.



"ఇప్పుడే వస్తాను. మీరు ఇక్కడే ఉండండి" అంటోంది కమల.

"ఇదేదో బుకింగ్, సార్" అన్నాడు రాజా.

మాధవరావుకు మాత్రం ముఖం చికాగ్గా ఉంది—ఇటు కమలని, అటు రాజాని చూస్తూ ఉంటే.

కమల టెలిఫోన్ పెట్టేసింది.

"సార్, కొంచెం అర్జంటు పనుంది. ఒక గంట పర్మిషన్ కావాలి" అంది.

రాజా క్రీగంట చూస్తున్నాడు మాధవరావువంక, ఫైల్లో ఏదో చదువుతున్నట్టు.

"ఎందుకు?" అన్నాడు మాధవరావు కొంచెం కటువుగా.

"మా వూరి నుంచి మా ఆత్తగారి చెల్లెలు కొడుకొచ్చాడండి. వాడి కేదో ఇంటర్వ్యూ ఉందిట ఇక్కడ. బస్ ప్రొద్దున్నే రావలసింది ఇప్పుడొచ్చింది. తీరా మా ఇంటికెళ్తే, మా ఇల్లు తాళంవేసి ఉంది. ఆయన బయటి నుంచి నాకు ఫోన్ చేశాడు. వెళ్ళి కీ ఇచ్చి వస్తాను" అంది కమల.

మొహంచూస్తే ఏమీ అనుమానం రావటం లేదు.

రాజా వైపు తల త్రిప్పాడు. రాజా మాత్రం తలూపు తున్నాడు. అతి డిందా కన్న మాటలు గుర్తు కొచ్చాయి. "బుకింగ్, సార్" ...

ఎందుకో పర్మిషన్ ఇవ్వొద్దనిపించలేదు మాధవరావుకి. "వెళ్ళి, త్వరగా వచ్చేయండి" అన్నాడు.

కమల త్వరత్వరగా సీట్లోంచి లేచి హేండ్‌బాగ్ పట్టుకుని, గబగబా బయటి కెళ్ళింది. డిపార్ట్‌మెంటులో అందరూ చూస్తున్నారు ఆ మందగమన వంక.

మాధవరావు కాలుస్తున్న సిగరెట్టుని బయట పారేద్దామని కిటికీ దగ్గర కెళ్ళాడు.

అప్పుడే రమేష్ బయట కెళ్తున్నాడు స్కూటర్ మీద.

మాధవరావు మొహం ఎర్రబడ్డది. ఎందుకో కమల, వాడూ బయటికెళ్ళి కలుస్తారని అనుమానం వేసింది. కమల తనని ఫూల్‌ని చేసిందని చచ్చేంత కోపం వచ్చింది మాధవరావుకు. కడుపులో వేళ్ళు పెట్టి కెలికిన ట్లయింది.

ఛీ ఛీ! ఈ వర్కింగ్ లేడీస్ అంటేనే వా కమ్యా మేస్తోంది. అయినా ఈ మగాళ్ళకి బుద్ధి లేదు. తన సంపాదనలో బ్రతకడం చేర్చుకోక, ఈ పెళ్ళాలెందుకు పంపిస్తారో ఉద్యోగానికి అనుకున్నాడు మాధవరావు.

ఏదో మాట్లాడుదామనుకున్న రాజాతో మరి చనువిచ్చినట్టుం టుందనుకుని వూరుకున్నాడు.

గడియారం మూడు గంటలు కొట్టింది. ఒంటి గంటకి బయటి కెళ్ళిన కమల గబగబా తలొంచుకుని సీట్లోకొచ్చి కూర్చుని, చేత్తో మొహం తుడుచు కుంటోంది.

మొహం కొంచెం అలసినట్టుంది.

ప్రక్కనే ఉన్న కూజాలోంచి ఒక గ్లాసు నీళ్ళు తీసుకుని త్రాగింది.

అప్పుడే ఎండలోంచి వచ్చింది కాబట్టి, ఫైల్

22—2—84

సైడ్ మీద చేతులు పెట్టుకుని కూర్చుంది, దానిపై తల ఆన్చి.

ఏదో ఫైల్ ఇద్దామని మాధవరావు అశోక్ దగ్గరి కెళ్ళాడు.

"సార్ — మీరు గమనించారా కమల గురించి ఒక విషయం!" అన్నాడు అశోక్.

ఏమిటన్నట్టు చూశాడు మాధవరావు అశోక్ వంక.

"కమల చీర మార్చుకొచ్చింది" అన్నాడు అశోక్ ఏదో పెద్ద రహస్యాన్ని బయట పెట్టినట్టు.

చూస్తుండగానే రాజా, డేవిడ్‌లు కూడా అశోక్ సీటు దగ్గర కొచ్చారు. ఈ విషయం తెలియగానే అందరూ తల ఆన్చుకుని పడుకున్న కమల వంకే చూస్తున్నారు — నోరు తెరుచుకుని, కన్నార్పకుండా.

మాధవరావుకి మాత్రం కమలని చూస్తుంటే వంటి మీద తేళ్ళు, జెర్రులు ప్రాకిన ట్టవుతోంది.

"ఏమిటి ఈవిడ ధైర్యం? పట్టపగలే ఈ వేషాలు" అనుకుంటూ వెళ్ళి సీట్లో కూర్చున్నాడు.

సీట్లో కూర్చున్నాడే కానీ, పనేమీ సాగట్లేదు. మనస్సంతా పరిపరివిధాల కమల గురించే ఆలోచిస్తోంది.

ఈ ప్రపంచంలో స్త్రీని సృష్టించిన ఆ దేవుడి మీద చచ్చేంత కోపం వచ్చింది మాధవరావుకు.

మనం వినే పురాణాల్లో ఉన్న సీత, సావిత్రి అనసూయ, సతీ సక్కుబాయిలు కేవలం, మగ వాళ్ళని ఫూల్స్‌ని చేయడానికి రాయబడ్డ కట్టు కథలనిపించింది మాధవరావుకి.

చక్కటి ముఖారవిందం, పలు వరస, ఒడ్డూ పొడుగూ, దానికి తగ్గ వయస్సు ఉన్న ప్రతి ఆడదీ దాన్ని మొగాళ్ళ కొక ఎరగా వాడి, వాళ్ళని వెర్రి వాళ్ళను చేసే నరరూప రాక్షసులు ఈ ఆడవాళ్ళు అనుకున్నాడు మాధవరావు.

• • • •

"మీ ఉష లెక్కలు బాగా చేస్తోందా, సార్" అని అడిగింది కమల.

తలెత్తి చూసిన మాధవరావుకు తన కుమార్తె గురించి, కమలతో మాట్లాడా లనిపించలేదు.

"వూ" అన్నాడు ముభావంగా.


"నాకు, చిన్నప్పుడు లెక్కల్లో నూటికి నూరు వచ్చేవి, సార్. చివరికి నాకు పెళ్ళయిం తర్వాత కూడా బి. ఏ. లో లెక్కల్లో డెబ్భై శాతం వచ్చిందండి. ఏదీ, పిల్లల్తో తీరిక ఉండదు కదండి. లేకుంటే బి. ఏ. లో కూడా వందమార్కులు సంపాయించే దాన్నండి" అంది కమల నవ్వుతూ.

ఒక్కసారి మాధవరావుకు కమలని చూస్తే ఎంతో గౌరవమేసింది.

ఎంత నిర్మలంగా మాట్లాడుతుంది.

తను మాట్లాడే ప్రతి మాటలో ఎంతో వినయం, ఆత్మీయతా ఉంటా యనుకున్నాడు మాధవరావు. అందరూ కమల నపార్థం చేసుకుంటున్నారేమో" నన్న అనుమానం కొంచెం ఈ మధ్య ఎక్కువయ్యిం దతనికి.

"ఏమో, ఎవ రేమనుకున్నా తను మాత్రం




తప్పుపట్టించి, కమల గురించి చెడుగా అనుకోవద్దు" అనుకున్నాడు మనసులో.

అయితే మరి ఈ టెలిఫోన్ల సంగతేమిటి. మొన్న మధ్యాహ్నం ఇంటి కెళ్తానని వెళ్ళిన కమలకి చీర మార్చుకోవాల్సిన అవసర మేమొచ్చింది. ఒక విధంగా రాజా, అశోక్ అనుకునే మాటలు నిజమని పించింది.

ఇంతలో ప్యూను వచ్చి కమలని—"అకౌంట్స్ ఆఫీసరు గారు పిలుస్తున్నారండి" అన్నాడు.

ఆ మాట విన్న కమల లేచి, నేరుగా అకౌంట్స్ ఆఫీసరు గారి రూమ్‌కేసి వెళ్తోంది—కొన్ని వందల కళ్ళు తననే చూస్తూ ఉంటే.

అయినా అకౌంట్స్ ఆఫీసర్‌కి, కమలకీ పనిలో ఏమాత్రం సంబంధం లేదు. కమల సీట్లో అకౌంట్స్‌కి సంబంధించిన పనేమీ లేదు. కదా! మళ్ళీ మాధవరావు మనసు పరిపరివిధాలా పోయింది.

మళ్ళీ రాజా, అశోక్, ఇతరులు వచ్చి మాధవరావు చుట్టూ మూగారు. "చూడండి, గురువుగారూ, మన అకౌంట్స్ ఆఫీసర్ పెద్ద శృంగార పురుషుడండీ బాబూ. ఆయన దృష్టి మన కమల మీద పడిం దండి" అన్నాడు అశోక్.

"ఇంకేముంది. మరో ఐదొందలు సంపాదన" అన్నాడు డేవిడ్.

మాధవరావుకి నిజంగానే అకౌంట్స్ ఆఫీసర్ వ్యవహారం మీద అనుమాన మేసింది. ధైర్యంచేసి ఏదో పనిమీద, అకౌంట్స్ ఆఫీసరు రూమ్‌కెళ్ళి లోపలి భాగోతం చూడాలనుకుని, ఒక ఫైల్ చేత్తో పుచ్చుకుని గబగబా అకౌంట్స్ ఆఫీసర్ రూమ్‌కెళ్ళి, తలుపు సగం తెరిచాడు.

ఒక్కసారి ఖంగు తిన్నాడు.

అకౌంట్స్ ఆఫీసర్ అప్పుడే చేతిలోని రెండు వంద రూపాయల నోట్లు కమల చేతి కిస్తున్నాడు. కమల ఏదో చెప్తుంటే తను డైరీలో రాసుకుంటున్నాడు మళ్ళీ మాధవరావుకి కమలంటే అసహ్యమేసింది.

గబగబా నడుస్తూ బయట కెళ్ళిపోయాడు కాంటీను వైపు.

తలనొప్పి వస్తున్నట్టుంటే, ఒక స్ట్రాంగ్ టీ తెప్పించుకుని ఒక మూలన కూర్చుని త్రాగటం మొదలు పెట్టాడు.

ప్రక్కనే ఉన్న టెలిఫోన్‌లోంచి ఎవరో పెద్దగా మాట్లాడ్డం వినపడుతోంది.

"అది కాదు, కమలా.. నా మాట విను" అన్న మాట వింటూనే ఒక్కసారిటీ కప్పు కింద పెట్టాడు మాధవరావు. అటువైపు తల త్రిప్పి.

మాధవరావు మొహం కందిడ్డలా గయింది ఒక్కసారి ఆ టెలిఫోన్‌లో మాట్లాడతున్న మనిషిని చూస్తే నా డెవరో కాదు—'రమేష్!'

రమేష్ మాధవరావుని చూడలేదు. ఎందుకంటే, మాధవరావు కూర్చున్న టేబిల్ రమేష్ వెనక ప్రక్కగా ఉంది

మాధవరావుకి కొంచెం ఆసక్తి పుట్టింది రమేష్ మాటలు విందామని.

ఒక్కసారి అటూ ఇటూ చూసి తన టేబిల్ మార్చి, రమేష్‌కి వెనక ప్రక్కనే, దగ్గరగా ఉన్న టేబిల్ కెళ్ళి కూర్చున్నాడు, మెల్లిగా ఎవరూ చూడకుండా

"ఎప్పుడూ నీ మాటే కానీ, నా మాట విని పించుకోవు నువ్వు. నే నెప్పుడు హోటల్‌కి రమ్మన్నా నువ్వు పెద్ద రాద్ధాంతం చేస్తూ ఉంటావ్."

కమల ఏదో చెప్తున్నట్టుంది.

"ఈ సారికి నువ్వు తప్పకుండా హోటల్‌కి రావాలి. నేను టేబిల్ కూడా బుక్ చేశాను. నువు రాకుంటే నేను చచ్చినంత ఒట్టే" అని రమేష్ టెలిఫోన్ పెట్టేశాడు.

అయితే రేపు మళ్ళీ ఒక గంట పర్మిషన్ ఖాయం అనుకున్నాడు మాధవరావు.

ఇంతలో, రమేష్ తనని చూసి "నమస్తే, సార్!" అంటూ వచ్చి తన పక్క కుర్చీలో కూర్చున్నాడు.

రమేష్ చూడ్డానికి చక్కగా ఉంటాడు. ఇంకా పెళ్ళి కానట్టుంది. (పెళ్ళెందుకులే కమ లుండగా అనుకున్నాడు మాధవరావు)

ఎందుకో మాధవరావుకి రమేష్‌ని చూస్తూనే జాలేసింది. చెడ మార్గాన పోతున్న ఆ తెలిసీ తెలియని వయస్సులో ఉన్న రమేష్‌ని మంచి మార్గాన పెట్టాలని మాధవరావు రమేష్‌తో మాటలు మొదలు పెట్టాడు.

"ఏమిటోయ్. ఒక్కడివే వచ్చావా కాఫీకి" అన్నాడు ఒక కాఫీ ఆర్డరిస్తూ.

"నే నెప్పుడూ ఒంటరిగానే, సార్! నాకు ఈ ఆఫీసులో స్నేహితులు చాలా తక్కువ. ఒక విధంగా అసలు లేరనే చెప్పాలి" అన్నాడు గ్లాసులో నీళ్ళు తాగుతూ.

అవును. నీకు స్నేహితు లెందుకూ కమలుండగా అనుకున్నాడు మాధవరావు.

"అయితే చూడు, రమేష్! నీకు ఎన్నో రోజులుగా నే నొక మాట చెబుదామనుకుంటున్నా. బహుశా నీవేమనుకోవనే అనుకుంటున్నా."

కాఫీ తాగుతున్న రమేష్ ఒక్కసారి తలెత్తాడు ఆశ్చర్యంగా మాధవరావు వంక చూస్తూ.

"చూడు, రమేష్! నీవు ఇంకా ఈ ప్రపంచంలో అనుభవం లేని వాడివి. ఇప్పు డీ వయసులో ఏమి చేసినా బాగానే ఉంటుంది కాని, మనిషికంటూ కొన్ని విలువ లుండాలి. ఆడ, మగాకి మధ్య కేవలం శారీరక సంబంధమే కాక, సంఘం కొన్ని అత్యున్నత స్థానాల్ని మనకు కేటాయించింది. ఈ స్థానాల్ని మనం మరిచి నట్టయితే, మనిషికి—పశువుకీ ఏమీ తేడా ఉండదు. అందుకే, మనం—"

"సార్! మీ రేం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. మీరు కొంచెం డైరెక్టుగా చెబితే బాగుంటుంది" అన్నాడు కొంచెం సీరియస్‌గా.

"అయితే విను" అన్నాడు మాధవరావు, నోట్లో పెట్టుకున్న సిగరెట్‌ని వెలిగిస్తూ.

"చూడు, రమేష్! నీవు వయసులో కమల కన్నా చిన్నవాడివి. నీవు కమలతో చెడు తిరుగుళ్ళు తిరుగుతూ మొదట డబ్బూ, తరవాత ఒళ్ళు పాడు చేసుకుని ఆఫీసులో అందరి నోటా పడేకన్నా, ఆ తిరుగుబోతు కమలకు దూరంగా ఉండి, ఇప్పటి నుంచైనా ఆఫీసులో కొంచెం మంచి పేరు తెచ్చు కుంటావని కోరుకుంటున్నాను" అన్నాడు మాధవ రావు సిగరెట్ పీలుస్తూ.

ఒక్కసారి రమేష్ మొహంలోకి చూశాడు తలెత్తి మాధవరావు.

రమేష్ ఎత్తిన కాఫీ కప్పుని కింద పెట్టాడు—కళ్ళలో నీళ్ళు గిర్రున తిరుగుతూ ఉంటే. చూస్తూ ఉండగానే కన్నీళ్ళు ధారగా కారడం మొదలు పెట్టాయి.

మాధవరావుకి ఏమీ అర్థం కాలేదు. రమేష్ దస్తీతో కళ్ళు తుడుచుకుని— "ఎంతెంత మాట లన్నారు, సార్, మీరు నన్ను, మా కమలని. కమల నా సొంత అక్కయ్య కాకపోయినా అంతకన్నా ఎక్కువగా చూసుకునే తమ్ముడి లాంటి వాడిని, సార్, నేను.

సరిగ్గా ఏడేళ్ళ క్రితం ఒకసారి నేనూ, అప్పుడే పెళ్ళయిన మా అక్కయ్యా రైల్లో వెళుతున్నాం, సార్, బెజవాడ నుండి గూడూరుకి—మా అక్కయ్యని అత్త వారింట్లో దింపుదామని. రాత్రి రెండు గంటలకి రైలు గూడూరు చేరుకుంది. మా కొత్త బావగారు గూడూరులో మైనింగ్ ఇంజనీరు, సార్!

"రెండింటికి రిక్షాలో, నేనూ మా అక్కయ్యా వెళుతూ ఉంటే ఒక్కసారి నలుగురు రౌడీలు మా మీద పడి రిక్షావాణ్ణి, నన్నూ చితకబాది మా అక్కయ్య నెత్తుకు పోయారు, సార్! అప్పటినుంచీ పిచ్చివాడిలా గూడూరు దరిదాపుల్లో ప్రతి పూటా రాత్రింబవళ్ళూ వెతికాం మా అక్కయ్య ఆచూకీ గురించి ఇన్నేళ్ళయినా ఆమె జాడ మా కే మాత్రం తెలియలేదు, సార్!"

"అలా మరిచిపోయిన మా అక్కయ్య నాకు హఠాత్తుగా కమల రూపంలో కనబడింది, రెండేళ్ళ క్రితం నాకు ఈ ఆఫీసులో ఉద్యోగం వచ్చినప్పుడు.

మా అక్కయ్య సరళ పోలికే వున్నాయి కమలవి, సార్! అయితే కమల కొంచెం మాటకారి.

పరిచయమైనప్పటినుంచీ, నేను కమలలో మా అక్కయ్యనే చూస్తూ సరళ లేని బాధను తీర్చు కుంటున్నాను, సార్!"


## తెల్ల మచ్చలకు చికిత్స



తీవ్రమైన ఒక పరిశోధన తరువాత తెల్ల మచ్చలను బాగు చేసేందుకు గాను మా మందు కనిపెట్టబడింది చికిత్సను గనుక పూర్తిగా పొందుతే మచ్చల రంగు మారి శరీరానికి మునుపటి రంగు తిరిగి వస్తుంది. జబ్బు మొదళ్ళలో నుండి కూడా పూర్తిగా నయమౌతుంది. మీరు నిరాశ చెందినట్లయితే తప్పకుండా ఈ చికిత్సను పొందండి. మా చికిత్సను పూర్తిగా పొందినట్లయితే ప్రచారణకై ఒక ఫైల్ ఉచితంగా ఇవ్వబడుతుంది. రోగుల వయస్సుతో సహా జబ్బు పూర్తి వివరాలను వ్రాయండి.

## దాంపత్య జీవితాన్ని ఆనందించండి



బాల్యంలో చేసిన పొరపాట్లకు లేక మరి ఏ ఇతర కారణాలకు గాని లోవై సిగ్గుతో మీ బలహీనతను ప్రదర్శించలేక దాంపత్య జీవితంలో ఎటువంటి ఆనందభరితమైన సుఖాన్ని అనుభవించ లేక పోతున్నారా...అయితే రహస్యమైన మీ జబ్బు యొక్క పూర్తి వివరాలను వ్రాయండి. దాంపత్య జీవితంలో గల నిజమైన సుఖాన్ని అనుభవించేందుకు సలహాలను పొందండి.

## తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది. ఒక కోర్సులో 3 ఫైల్స్ ధర రూ. 35/- పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN (A )**
***P.O. KATRI SARAI (GAYA) PIN : 805 105***




## పెండ్లి సంబంధాలు

**అన్ని వయసులలోను మీకు సరిపోయే వధూవరులకై సంప్రదిం చండి. కమ్మ కులానికి చెందిన వారు మాత్రమే వ్రాయండి.**

**కాకతీయ ఇన్ఫర్మేషన్ సర్వీస్**

**రాజేంద్రనగర్,**
**1st LINE**
**గుడివాడ - 521 301 (ఆం. ప్ర.)**
**ఫోన్ : 940 (08674)**




అంటే రేపు నా బర్త్‌డే సార్! పోయిన సంవత్సరం నా బర్త్‌డే రోజు హోటల్లో లంచ్‌కి వస్తానని చెప్పిన కమలక్కయ్య, తీరా ఎవరైనా చూస్తే బాగుండదు అంటూ దాటేసింది, సార్! నేను పట్టు పడితే, సరే వచ్చే సంవత్సరం వస్తాలే. అంటూ మాటిచ్చింది. తిరిగి ఇప్పుడూ అదే వరస. హోటల్ వద్దంటూంది. నా సహోదరి కాకపోయినా, నేను కమలని నా సరళ కన్నా ఎంతో ప్రేమిస్తాను. రోజు కొకసారైనా చూడందీ, మాట్లాడకుండా ఉండందీ నాకు ఏదో పిచ్చెక్కినట్టుంటుంది, సార్!

"అంటే నా కిప్పుడే తెలుస్తోంది. ఈ లోకం నా గురించి, కమల గురించి లేని పోని వనుకుంటున్నారని. కమల చాలా మంచిది. చూస్తూ చూస్తూ సరళని పోగొట్టుకున్నాను. కమలక్కూడా అన్యాయం జరక్కూడదు, సార్! ఇంకొన్ని రోజులు నే నీ ఆఫీసులో పని చేస్తే కమల పేరు రోడ్డున పడుతుంది. దీని కేదైనా చెయ్యాలి. అలా జరగటానికి వీల్లేదు" అంటూ లేచాడు రమేష్.

మాధవరావు మాత్రం అలా కుర్చీలోనే కూల బడ్డాడు నిర్జీవంగా

•  •  •  •

"గురువుగారూ! మీ కో వార్త తెలిసిందా?" అంటూ సీటు దగ్గర కొచ్చాడు రాజా.

ఏమిటన్నట్టు చూశాడు మాధవరావు.

"మన కమల బాయ్ ఫ్రెండ్ ఉద్యోగం రిజైన్ చేశాట్ట, సార్? ఏదో కొత్త పిట్ట దొరికుంటుంది!" అన్నాడు, హుషారుగా.

మాధవరావు కొంచెం కోపంగా—"వెళ్ళి నీ పని చూసుకో, రాజా" అన్నాడు. రాజాకు మాధవరావు మాట లేవో వింతగా అనిపించి, లేచి తన సీట్లోకెళ్ళి కూర్చున్నాడు.

టెలిఫోన్ మ్రోగింది.

మాధవరావు ఏదో ఆలోచనల్లో ఉండి మ్రోగుతున్న బెల్‌ని వినిపించుకోవడం లేదు. గబుక్కున అశోక్ వచ్చి టెలిఫోన్ అందుకున్నాడు.

"హల్లో, మాధవరావుగారా? ... ఉన్నారండీ" అంటూ టెలిఫోను మాధవరావు కందించాడు అశోక్—"సార్ — టెలిఫోను కమల చేస్తోంది" అంటూ రిసీవర్ మీద చెయ్యి పెట్టి, లేవేమో "సార్! ఏదైనా ఎంగేజ్‌మెంట్ తగిలుంటుంది" అన్నాడు.

మాధవరావు ఒక్కసారి రిసీవర్ అందుకున్నాడు, అశోక్ చేతిలోంచి చిరాగ్గా.

"హలో...నేను, సార్, కమలని, గుడ్ మార్నింగ్."

"ఇవాళ మా అమ్మాయి ఒంట్లో బాగాలేదు. నేను ఆఫీసుకు రావడం లేదు, సార్. పోతే ...

టెలిఫోన్ కట్ అయింది. మాధవరావు మనసు మళ్ళీ పరిపరివిధాలా పరుగెడ్తోంది. రమేష్ మంచి వాడే కావచ్చు.

మరి కమల?

మళ్ళీ టెలిఫోను బెల్ మ్రోగింది. కమల మాట్లాడుతోంది. "సార్, టెలిఫోను కట్ అయింది. నేను మా ప్రక్కింటబ్బాయితో ఓ కవర్ పంపిస్తా, సార్! అది దయచేసి మన అకౌంట్స్ ఆఫీసరుగారి కివ్వండి. నిన్న పొద్దున్న ఆయన ఆఫీసుకి వస్తుంటే పోలీసు వాళ్ళు, డ్రైవింగ్ లైసెన్స్ వెంట లేదని బుక్ చేశారట. ఆయన నిన్న ఆ రసీదు, రెండు వందలూ నా కిచ్చారు మా ఆయన కిమ్మని, ఆ ఫైన్ కట్టడానికి. మా ఆయన ఫైన్ కట్టి ఆ రసీదూ, మిగిలిన పైకం తెచ్చిచ్చారు, సార్! అది మీరు దయ చేసి అకౌంట్స్ ఆఫీసరుగారి కిచ్చెయ్యండి." ఇంకేదో కమల మాట్లాడుతూ ఉంటే, మాధవరావు తనేదో అథఃపాతాళానికి త్రొక్కెయ్యబడుతున్నట్టు ఫీల్ అయ్యాడు.

మాధవరావు రిసీవర్ పెట్టేసి కళ్ళు మూసుకుని రెండు చేతులూ నుదురు మీద పెట్టుకున్నాడు. అతి కొంత వ్యవధిలో రెండవసారి, తనకు తాను నైతికంగా ఎంతో చిన్నవాడైనట్టు ఫీలయ్యాడు.

అంతే! ఆ రోజంతా ఆయన మనస్సంతా వికలమైంది. ఆఫీసులో పని సరిగ్గా చెయ్యలేకపోయాడు. ఎప్పుడూ లేనిది, ఆ రోజు మూడు పాకెట్ల సిగరెట్లు కాల్చాడు, ఆరు కప్పుల టీతోపాటు.

ఆఫీసునుండి బయటి కొచ్చాడు చికాగ్గా ఉన్న మనసుతో.

బస్‌కోసం నిలబడ్డానికి ఓపికలేక, నడక మొదలెట్టాడు.

ఒక ఫర్లాంగు నడిచేసరికి "నమస్తే, సార్." అన్న కమల కంఠం విని ఉలిక్కిపడ్డాడు.

"నమస్తే" అన్నాడు అప్రయత్నంగా రెండు చేతులూ పైకెత్తుతుంటే.

ఎదురుగా కమల, ప్రక్క నెవరో కుర్రాడున్నాడు. మళ్ళీ మాధవరావులో ఉన్న మర్కటం మాట్లాడ్డం మొదలెట్టింది.

'ఇంకో కుర్రాణ్ణి పట్టింది' అంది మర్కటం.

"ఇతనే, సార్, మొన్న మా పూర్ణించి వచ్చిన మా ఆయన కజిన్. నిన్న ఇంటర్వ్యూ అయిపోయింది. రేపూరెళ్ళి పోతున్నాడు. ఇవాళ నే నెలాగ లీవుకదా అని షాపింగ్‌కి బయల్దేరాం" అంది కమల, మాధవరావుని పరిచయం చేస్తూ.

"గ్లాడ్ టు మీట్ యూ, సర్. మీరెంతో మంచి వారని చెప్పింది, సార్, వదిన. మొన్న గంట పర్మిషన్ అడగ్గానే ఇచ్చారట మీరు. లేకుంటే నాకు సాయంత్రం దాకా చాలా ఆలస్యమయ్యే దండి. ఆ గంటలోనే మా వదిన గబగబా వంటకూడా చేసిందండి నాకోసం.

చూస్తూ ఉండగానే ఒక పెద్ద డేంజర్ తప్పి పోయిందండి మొన్న. మా వదిన వంటచేస్తూ ఉంటే చీర చెంగుకి నిప్పంటుకుంది.

కొద్ది సేపట్లో పెద్ద ప్రమాదం తప్పిందండి. సమయానికి నే నక్కడుండి ఆ మంట ల్నార్పేనండి. చీరమాత్రం చాలా వరకు కాలిపోయింది. పోన్లెండి— మా వదినకేం కాలేదు. నాకే ఈ ఉద్యోగం వస్తే అదేరంగు—అంటే చిలుక పచ్చని ఎర్ర అంచు గద్వాల్ చీర మా వదినకి ప్రజెంట్ చేస్తాను."

"ఉద్యోగం రాకుంటే మన్నానా." అంటోంది కమల నవ్వుతూ.

"వస్తానండి, కొంచెం తొందర పనుంది" అంటూ ముందడుగేశాడు మాధవరావు, కళ్ళు బైర్లు కమ్ముతూ ఉంటే.

అప్రయత్నంగా ఆయన కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఒక్కసారి తనమీద, ఈ మగజాతి మీదా కోపం, ద్వేషం పెల్లుబికింది.

కమల రూపం కళ్ళముందు ప్రత్యక్షమై, పెరిగి పెరిగి ఆకాశా న్నంటుకుంది.

తనుమాత్రం తరిగి తరిగి చీమంతైనట్టని పించింది.

రమేష్ వెళ్ళిపోయి కమలకి తమ్ముణ్ణి కరువుచేస్తే ఆ ఖాళీని అన్నగా తను పూర్తి చేయాలన్న ఆలోచనతో మనసు కొంచెం తేలకపడి ఇంటివైపు నడిచాడు మాధవరావు.

•  •  •  •

కమలమాత్రం తన చుట్టూ ఉన్న బురద దాంట్లో మెలుగుతున్న కీటకాల కతీతంగా, కల్మషం లేకుండా నిర్మలంగా ఉంది కమల లాగా.